క్లుప్తంగా

కొవ్వొత్తుల ప్రదర్శన



పొదలకూరు: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్యులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శ్రీపొట్టి శ్రీరాములు సేవా సమితి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆకులూరు మధు, అమరా రాంబాబు, ఆకులూరు నారాయణ, నున్నా శివ, రవి, సుజీవన్, మోహన్, సాయిచంద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు



కొడవలూరు: నాయుడుపాళెంలోని మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. మాగుంట గిరిధర్‌రెడ్డి, అపర్ణ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం వేడుకగా సాగింది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం పూజలు చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, నేతలు అడపాల మోహనకృష్ణ, కలువ బాలశంకర్‌రెడ్డి, మారంరెడ్డి రంగారెడ్డి, జూటూరు వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): కొండాయపాళెంలోని కావేరి నగర్‌లో ఇళ్ల మధ్య నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై దాడులను వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు శుక్రవారం జరిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన నిర్వాహకుడు ఖాజావలీ, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. సెక్స్ వర్కర్‌ను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన రమణయ్య (40) గ్రామానికి చెందిన ఇద్దరితో కలిసి గూడూరులో పొట్టేళ్ల కొనుగోలుకు ఆటోలో గురువారం రాత్రి బయల్దేరారు. నేషనల్ హైవే ఆఫీస్ ఎదురుగా రోడ్డుపై గుంతల్లో ఆటో పడింది. దీంతో ప్రమాదశాత్తూ రమణయ్య కిందపడగా, తలకు తీవ్రగాయమైంది. ఈ క్రమంలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి.. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, కుమారుడున్నారు.

ఉపాధి కూలీలకు జీవిత బీమా

- అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో 4.82 లక్షల మంది కూలీలు
- ప్రమాదం, సహజ మరణానికి రూ.రెండు లక్షలు
- జాబ్‌కార్డు ఉన్న వారికి వర్తించేలా చర్యలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పొదలకూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఇప్పటి వరకు జీవిత బీమా సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో పనులకు హాజరయ్యే 4.82 లక్షల మంది కూలీలకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎఫ్ఏ లేదా మేట్ అందజేసే దరఖాస్తుపై కూలీలు సంతకం పెట్టి అప్పగిస్తే బ్యాంక్ ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకుంటారని అధికారులు వెల్లడిస్తున్నారు.

రెండు రకాలుగా..

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన కింద బీమా భరోసాను కల్పించాలని కార్యాచరణ రూపొందించింది. మొదటి బీమా ప్రీమియం కింద ఏడాదికి రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదవశాత్తు కూలీ మృతిచెందితే రూ.2 లక్షలిస్తారు. రెండో దానికి సంబంధించి ప్రీమియం రూ.436 చెల్లించాలి. సహజ మరణం లేదా ప్రమాదం జరిగి మృతి చెందితే రూ.2 లక్షలిస్తారు.

కూలీలకు ఉపయోగం

ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. కూలీల్లో వయసు మళ్లిన వారు, ఆరోగ్య సమస్యలున్న వారుంటారు. వడదెబ్బ ప్రభావం, ఇతర కారణాలతో మృతిచెందితే బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఫలితంగా వారి కుటుంబాలకు నగదు సాయం ఆసరాగా ఉంటుందని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ బీమా ప్రీమియం చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. రెండు రకాల సౌకర్యాలను కూలీలు పొందాల్సిందిగా సూచించారు. దీనిపై మండలాల్లో సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు. మండే ఎండల వల్ల ఉపాధి పనులకు సైతం కూలీలు సక్రమంగా వెళ్లడం లేదు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా రోజుకు 75 వేల మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. చాలా మండలాల్లోని గ్రామాల్లో పనులు జరగడం లేదు.

బీమా సౌకర్యం పొందాలి



జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలు విధిగా బీమా సౌకర్యం పొందాలి. బ్యాంక్ ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించుకోవడం జరుగుతుంది. ఎవరికీ నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

– గంగాభవాని, డ్వామా పీడీ

నిలకడగా నిమ్మ ధరలు



లారీలోకి కాయలను లోడ్ చేస్తూ..

- బస్తా కాయలు రూ.ఏడు వేలు

పొదలకూరు: నిమ్మ ధరలు గతేడాదితో పోలిస్తే తక్కువగా ఉన్నా నిలకడగా ఉండటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాడు ఇదే నెలలో బస్తా కాయలు రూ.9 వేల వరకు ధరలు పలికాయి. అయితే ఈ ఏడాది రూ.7 వేల వద్దే ఆగినా కొద్దిగా రోజులుగా నిలకడగా ఉండటంతో రైతులకు ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రస్తుతం లూజు (బస్తా) ధరలు ఒక్కింటికి రూ.5,400 నుంచి రూ.7 వేల వరకు ఉంది. కిలోల లెక్కన చూస్తే రూ.65 నుంచి రూ.85కు అమ్ముడుపోతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో టాప్ రూ.6 వేలు మాత్రమే పలికింది. పొదలకూరు, గూడూరు నిమ్మ మార్కెట్ల నుంచే నిత్యం 25 లారీల కాయలు ఎగుమతి అవుతుంటాయి. అలాగే తెనాలి, ఏలూరు, రాజమండ్రి మార్కెట్ల నుంచే కాగా రాయలసీమ జిల్లాల్లోని చిన్న చిన్న మార్కెట్ల నుంచి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి.

తగ్గిన ఎగుమతులు

నిమ్మ ఎగుమతులు వారంరోజులుగా తగ్గాయి. తోటల్లో కాయలు బాగా తగ్గిపోవడం వేసవి తాపం పెరగడంతో ఢిల్లీ మార్కెట్లో డిమాండ్ పెరిగింది. ఏపీ, తెలంగాణ నుంచే కాక బయటి రాష్ట్రాల నుంచి కూడా ఎగుమతులు తగ్గినట్టుగా తెలుస్తోంది. నిత్యం అన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 లారీల్లో కాయలు ఎగుమతి అవుతుండగా ప్రస్తుతం 50 లారీల్లోనే పంపుతున్నారు. కాయలు తోటల్లో పెరిగేంత వరకు ధరలు తగ్గకున్నా స్థిరంగా ఉంటాయని తెలుస్తోంది. ఉత్తర భారతదేశంలోని ఢిల్లీతోపాటు, లక్నో, వారణాసి, మథుర, గోరఖ్‌పూర్, అలహాబాద్ తదితర ప్రాంతాలకు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కాయలను ఎగుమతి చేస్తుంటారు. అయితే ఈ వేసవిలో ఫ్యాక్టరీలకు కాయలు వెళ్లవు. కేవలం ఇళ్లలో వాడుకకు, శీతల పానీయాలు సేవించేందుకు మాత్రమే నిమ్మకాయలను వేసవి సీజన్లో వినియోగిస్తున్నారు.



మార్కెట్‌కు వచ్చిన కాయలు

డిగ్రీ పరీక్షలకు 12 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 12 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 16 మందికి గానూ నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వెల్లడించారు.

బాలాలయ నిర్మాణానికి శ్రీకారం

పొదలకూరు: స్థానిక రామమందిరం పునర్నిర్మాణ పనులను ప్రారంభించే ముందుగా భక్తులు సీతారాములకు బాలాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండురోజుల క్రితం బాలాలయానికి శంకుస్థాపన చేసి శుక్రవారం బోరును వేయించారు. భక్తులు, ఉభయకర్తలు కలిసి రామాలయాన్ని నిర్మించేందుకు చందాలు పోగు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో దళిత యువకులు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. కేసుల భయంతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాక్కున్నాడన్నారు. అనంతరం అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలికి వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు అశోక్, సుమన్, గాలి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

కోవూరు: కుష్టు వ్యాధిపై అవగాహన అవసరమని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ఇనమడుగు పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ ఇర్ఫాన్, ఏఎస్ఎం భూదేవి ఆశ వలంటీర్లు స్వర్ణమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న సత్యవాణి

పొదలకూరు: ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీలోని జంగాలకండ్రిగలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల భూములు గుల్లబారి, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. పంటలు వేసేందుకు ముందు 30 విత్తనాలు కలిసిన ఈ నవధాన్యాలను సాగు చేయడం ద్వారా భూములు సారవంతమై, అధిక దిగుబడి వస్తుందన్నారు. వీటిని సాగు చేయడం వల్ల భూమి ఆరోగ్యం పెరుగుతుందని, వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. జిల్లాకు 80 వేల కిట్లు విడుదలయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం మాలకొండయ్య, డీపీఎం మునిరత్నం, మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నరాణి, వ్యవసాయ విస్తరణాధికారులు దేవరాజ్, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ



రజత పతకాన్ని సాధించిన శరత్‌కుమార్



కాంస్య పతకాన్ని సాధించిన మోహన్ శివరాం

తోటపల్లిగూడూరు: స్పెషల్ ఒలింపిక్స్ భారత్ 2025 – 26 క్రీడా పోటీల్లో తోటపల్లిగూడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నూజివీడులో ప్రత్యేకావసరాల గల పిల్లలకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. స్థానిక పాఠశాలకు చెందిన శరత్‌కుమార్, మోహన్ శివరాం అనే విద్యార్థులు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించారు. శరత్‌కుమార్ లోయర్ ఎబిలిటీ 100 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్ మెడల్, మోహన్ శివరాం బ్రాంజ్ మెడల్ సాధించారు. వారు సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రారెడ్డి, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. విద్యార్థులను శుక్రవారం హెచ్ఎం, టీచర్లు అభినందించారు.

ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

పొదలకూరు: బయోమెట్రిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న గిరిజనుల కోసం మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ టీవీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న తాటిపర్తి – 1 సచివాలయంలో తాటిపర్తి, నల్లపాళెం, మహ్మదాపురం, అదేరోజు కనుపర్తి సచివాలయంలో ఆల్తుర్తి, కనుపర్తి గ్రామాల గిరిజనులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. 29న విరువూరు సచివాలయంలో విరువూరు, సూరాయపాళెం వారికి, 30న నావూరు సచివాలయంలో నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డి పల్లి వారికి, అదేరోజు వావింటపర్తి సచివాలయంలో వావింటపర్తి, పులికల్లు వారికి, మే 1న ప్రభగిరిపట్నం సచివాలయంలో ప్రభగిరిపట్నం, అమ్మవారి పాళెం వారికి, అదేరోజున డేగపూడి సచివాలయంలో డేగపూడి, ఇనుకుర్తి, మర్రిపల్లి, దుగ్గుంట వారికి, 2న బత్తులపల్లి సచివాలయంలో బత్తులపల్లి, నేదురుమల్లి, వెలికంటిపాళెం వారికి, అదేరోజున మరుపూరు సచివాలయంలో మరుపూరు వారికి, చాటగొట్ల, 3న తోడేరు సచివాలయంలో తోడేరు వారికి, అయ్యగారిపాళెం, నందివాయ వారికి, అదేరోజున బిరదవోలు సచివాలయంలో బిరదవోలు, పార్లపల్లి వారికి, 4న పొదలకూరు – 1 సచివాలయంలో పొదలకూరు – 1, 2 సచివాలయాల పరిధిలోని వారికి, అదేరోజున పొదలకూరు సచివాలయం – 3లో పొదలకూరు – 3, 4 సచివాలయాల పరిధిలోని వారి కోసం శిబిరాలు ఏర్పాటు చేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ దిగుబడుల పెంపునకు కృషి

కోవూరు: ప్రకృతి వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు రైతులు కృషి చేయాలని ఏడీ సుజాత కోరారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మండలంలోని పోతిరెడ్డిపాళెంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం నవధాన్యాలను పంపిణీ చేశారు. తొలుత ర్యాలీని జరిపారు. ఏఓ ఇందిరావతి, ఉమామహేశ్వరి, దాసరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, రైతుల ర్యాలీ

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



కొడవలూరులో అవగాహన ర్యాలీ



కోవూరులో..

కోవూరు: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి నిరంజన్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి ఇర్ఫాన్, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: మలేరియా అంతం మనతోనే సాధ్యమని వైద్యాధికారి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు అవగాహన ర్యాలీని స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి నాగరాజు, సీహెచ్ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం శేషుబాయి తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు దూరంగా ఆర్టీసీ

- ఆటోలే దిక్కు
- తప్పని ఇబ్బందులు



బస్సెక్కేందుకు విద్యార్థుల అవస్థలు (ఫైల్)

మనుబోలు: కొంతకాలంగా ఆర్టీసీ బస్సులు పల్లెలకు దూరమవుతున్నాయి. మనుబోలు మండల కేంద్రం నుంచి చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొందరు ఆటోవాలాలు బాధ్యత మరిచి పరిమితికి మించి ఎక్కించుకుని వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మండలంలోని పిడూరు, ఎల్ఎన్ పురం, కాగితాలపూరు, మడమనూరు, గురివిందపూడి తదితర గ్రామలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బస్సులు గ్రామాల లోపలికి వెళ్లకుండా ప్రధాన రహదారి గుండానే వెళ్లిపోతున్నాయి. మనుబోలు నుంచి బస్సులో ప్రయాణించాక ప్రధాన రహదారి నుంచి గ్రామాలకు వెళ్లడానికి 1 నుంచి 2 కిలోమీటర్లకు పైగా నడవాల్సి వస్తోంది. వివిధ గ్రామాల నుంచి మనుబోలు హైస్కూల్‌కు వచ్చే చాలామంది విద్యార్థులు ఆటోవాలాలతో నెలకు ఒకసారి నగదు చెల్లించేలా ఒప్పందం చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మనుబోలులో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో మూడోవంతు మంది వివిధ గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. చాలామంది ఆటోల్లో వెళ్తున్నా.. వచ్చే ఒకటి రెండు బస్సులు మిగిలిన వారికి ఏ మాత్రం సరిపోవడం లేదు.

ప్రస్తుతం బడులు, కాలేజీలకు సెలవులు. అవి పునఃప్రారంభయ్యేలోగా ఆర్టీసీ అధికారులు స్పందించి అన్ని గ్రామాల లోపలికి బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

రెండుసార్లయినా బస్సులు నడపాలి



గురివిందపూడి నుంచి మనుబోలు, గూడూరు, నెల్లూరు వెళ్లాలంటే హైవే వరకూ కిలోమీటర్‌పైగా నడవాల్సి ఉంటుంది. గ్రామస్తులతోపాటు విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో గ్రామానికి ఆర్టీసీకి బస్సు వచ్చేది. ఉదయం, సాయంత్రం బస్సును గ్రామంలోకి నడపాలి.

– మన్నెమాల శ్రీహరిరెడ్డి, గురివిందపూడి

విద్యార్థులు, పేదలకు ఇబ్బంది



మా గ్రామం నుంచి మనుబోలు, గూడూరు, నెల్లూరు లేదా ఇతర చోట్లకు చేరాంటే హైవేపై పైకి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు లోపలికి రావడం లేదు. దీంతో ఒకటిన్నర కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. మాలాంటి వాళ్లు ద్విచక్ర వాహనాల్లో వెళ్లినా పేదలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలే దిక్కుగా మారాయి.

– గుమ్మడి వెంకటసుబ్బయ్య, ఎల్ఎన్‌పురం

భూసార పరీక్షలతో ఎంతో మేలు



కొడవలూరు: గండవరంలో..

కొడవలూరు: భూసార పరీక్షలతో రైతులకు మేలు చేకూరుతుందని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. భూసార పరీక్షలపై మండలంలోని నాయుడుపాళెం, గండవరం, కొత్తవంగల్లులో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. నేలలో పోషకాలపై తెలియకపోవడంతో రైతులు అధిక మోతాదులో ఎరువులను వినియోగిస్తున్నారని చెప్పారు. ఫలితంగా ఎరువుల ఖర్చు గణనీయంగా పెరగడంతో పాటు ఆశించిన ఫలితాలు దక్కడంలేదన్నారు. అనంతరం గతేడాది భూసార పరీక్షల పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు వంశీకృష్ణ, కవిత, శ్రావ్య, స్థానిక నేత మాగుంట సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- విడవలూరు: భూసార పరీక్షలను నిర్వహించడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య పేర్కొన్నారు. మట్టి నమూనాలను సేకరించే పద్ధతులపై మండలంలోని రామతీర్థం, రామచంద్రాపురంలో రైతులకు అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పంటలు కోసిన అనంతరం జీలుగ, పెసర, మినుము, జనుము తదితరాలను పొలంలో వేయడం ద్వారా నేల సారవంతమవుతుందని చెప్పారు. వీఏఏ వెన్నెల, సాయిమహేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఇందుకూరుపేట: మట్టి నమూనాలతో నేల స్వభావాన్ని తెలుసుకొని పంటకు అవసరమైన పోషకాలను అందించి దిగుబడిని పెంపొందించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మట్టి నమూనాలపై మండలంలోని గంగపట్నంలో రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ సుదీక్షణ తదితరులు పాల్గొన్నారు.



విడవలూరులో..



ఇందుకూరుపేట: గంగపట్నంలో..